సరిచేస్తూ" అన్నాడు. ఇంకా అన్నాడిలా "అలా విసరబడక పోతే వారికి సొంత హక్కు లోపించినట్టు నాతో కోపగించి పోరూ? వాళ్ళకు పట్ట పగ్గాలుంటాయా?"

రంగడు నిమీలితనేత్రుడయ్యాడు. "యాదాలావంగా పై శక్తుల తోక పట్టుకు అన్నానేగాని 'లెట్' అని నీచే తిరిగి భూమ్మీదకు విసరబడ్డానికి అనివుండలేదు. నీవంటే నాకేవిధమైన కోపం ఎన్నడూలేదు. నాకు కాళ్లు లేకపోయినా చేతులు లేక పోయినా వాయి యిచ్చావుగదా యని ఆ వాయినే రెట్టింతలు మూడింతలుగా పెంచి కీర్తిస్తూ నిన్నెప్పుడూ మంచివాణ్ణిగానే గుర్తించి యున్నాను. నాకు లెట్ హక్కూ వద్దు, షెవర్లెట్టు హక్కూ వద్దు, ఆమ్లెట్ హక్కూ వద్దు, కట్లెట్ హక్కూ వద్దు, ఛోక్లెట్ హక్కూ వద్దూ, ఎట్టి హక్కూ వద్దు, ఈ కాళ్ళూ చేతులూ నీవేను. నీపాదాల వేంపేను. నిరంతరం నీముందు సాష్టాంగంగా పడివుండనియ్యి నన్ను ఈవైకుంఠంలో నీసాన్నిధ్యాన్ని!" అని అన్నాడు రంగడు. ఆలా అంటూ దేవుని కాళ్ళు తన రెండుచేతులా అద్దుకొని వదలక—"ఇదే నాహక్కు. ఇదే నాజన్మహక్కు!" అన్నాడు.

భగవంతుడు సంతోషించి రంగణ్ణి తనలో లీనం గావించు కొని జన్మరహితునిగా చేశాడు.

.... .... .... .... ....

## ఎడదవెలితి

గోదావరీ జీవనదియొక్క అందం ఒయ్యారం ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా మారిపోతూ భావాల్ని ఉవ్విళ్ళూరిస్తూ వుంటుందో

వర్ణించడానికి శక్యంకాదు. ఒక్కొక్కప్పుడు వెండి ఒడ్డులు మోసి కొండల్లో ఊలలాడుతూంటుంది. వేఱొకప్పుడు ఎండి సన్నగిల్లి యిసుకమేటంచుల్ని తన చిరుకెరటాల్తో కవ్విస్తూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు రెల్లు దుబ్బు లిటూ యటూ బలిసి పోయి తెల్లగాపూసి కేవలం తన చీరకు చుట్టూ తెల్లంచు మాత్రమే మిగిలేటట్టు చెప్పిచెప్పి అద్దించుకొన్న వైఖరి నగ పిస్తుంది. ఒక్కొక్కప్పుడు పూతిక పుడకైనా లేకుండా అవురా వురుమంటూ వుండే ఆకారందాల్చి వేడిగాడుపు వీస్తూంటుంది. అతిమాయగా మహామాయగా ఒక్కొక్కప్పుడు నదిమీదుగా యద్దరి యపర సంధ్యా కుహరంలోనికి ఏపిట్టో ఎగిరిపోతూంటే ఇద్దరి నప్పటి కక్కడ దహన సంస్కారం పొందుతూవున్న ప్రేతంలోంచి లేచిపోయే ఆత్మగా ఆ పిట్ట తోస్తూంటుంది. మఱొకప్పుడు యద్దరినుంచి ఓనావ బారటిల్లిన తెరచాపతో ఇద్దరికి చేరుకుంటూంటే మానవలోకాన్ని తరింపజేయడానికి వచ్చే దేవదూతగా కవిపిస్తూంటుంది. నది యంటే గోదావరి నదే నది!

ఆ నదీమతల్లిని చూడ్డానికి, దానిదరిని నిలబడి సుఖించ డానికి, పెక్కుమంది రాజమహేంద్రవర పురీ వాస్తవ్యులు సాయంకాలమందు బాహాటంగా విహరిస్తూ కవిపిస్తూంటారు. తొడమీద పంచి వూపుకుంటూ నడవని మొగాడుగాని, ఎదమీద పంవిటి జార్చుకోకుండా నడవని ఆడదిగాని ఆవేళప్పుడు అప్రాంతమం దగపించరు. వారిలో ఎడంపక్షీలు అనగా లెఫ్టిస్టులు అనగా ఒకింత కాక పాలు ఎక్కువగా ఉన్నవాళ్ళమాట. వాళ్ళు అన్యోన్యం సరససల్లాపాలతో ప్రొద్దు గడపడం కష్టం. వారిలో అయిదో అరకు చెందినవారు అనగా ఫిఫ్తు కోలమిస్టులు అనగా

నేలంటకుండా తిరిగేవాళ్ళన్నమాట. వాళ్లు ఊహాతీతులై ఎక్క డెక్కడో వాళ్ళకు వాళ్ళే కనబడకుండా ఒకరివొళ్లో వొకళ్ళు కూర్చుని వుంటారు.

ఎవళ్ళయినా చూచివుంటే అనేవుందురు కూడాను— "సుబ్బులూ! అలా వాడివొళ్లో అంత బాహాటంగా కూర్చోవడ మేనా?" అని. సుబ్బులు వెంటనే అనీ వుందును—"తప్పే ముంది? వాణ్ణి నేను ప్రేమించాన" ని. అది కానేకాదు అసలు ప్రశ్న! పాఠకు లాలోచించవలసింది వాళ్ళక్కడ కెలా చేరుకోగలిగారూ అని.

వాళ్లు కూరుచున్నదో చిన్నలంక. లంకకూ వొడ్డుకూ మధ్య నీటిపాయ. చూదామంటే నకమొకాలా నావలేదు. పోటి రేవుగా దాటేరేమో అంటే అరకాల తడికనిపించదు ఇరువురికో వొక్కరికిస్నీ. అయితే గియితే వొక పంచకళ్యాణి గుఱ్ఱం తెల్లపూతలా తోకా జూలూ ఎగరేసుకొంటూ వాళ్ళతోపాటు ఆ లంకమీద వుంది. ఆ గుఱ్ఱాన్ని ఎక్కి వాళ్లు దాటివుండాలి ఆ రేవు.

ఆడదీ మగడూ కలిసి గుఱ్ఱమెక్కడమనేది మాలవాళ్ళ పెళ్ళిళ్ళకు చూచేం సాంఘికంగా. చారిత్రకంగా చిత్రించుకుంటే పృథ్వీరాజు సంయుక్తను గొంపోయినప్పుడు జరిగివుంది. మఱి కానం. ఆ గుఱ్ఱాన్నింతకూ వాళ్ళిద్దరూ ఎక్కి ఆ లంకకు దాట గలిగారన్నది ఊహించవలసిందేగాని ఎవరున్నూ చూచింది లేదు. వాళ్ళు తిరిగి రాకపోతారా? ఆ రావడం ఎలావస్తారో తెలిసికోగలిగితే వాళ్ళెలా వెళ్ళారో బోధపడదా అంటే మనం

సూర్యుడు సాంధ్యకాంతిలో మునిగి కునికిపోయినాక చీకటి కమ్ముకుపోవడమనేది ఎంతోసేపు పట్టదు. కాని ఆ కాస్త సావకాశంలోనూ జరిగే సంగతులు విశేష విషాదదాయకములూ గావచ్చు. విశేష వినోదదాయకములూ గావచ్చు. సుబ్బులు వాళ్లో అందాకా పెట్టుక్కూర్చున్న వో ధగఫగలాడే ఇత్తడి బిందె, మంచినీళ్ళబిందె, పైకాయి మాయి గారడీగా ఎత్తుతూ, ఎత్తడంలో ఇసకను అంచి తనబరువు తాను మోసికోలేనన్నంత యిదిగా ఆపె శరీరం దానిమీదకు వొంచుకొన్నదై పంచు కొన్నదై పైకిలేచింది. ఆ లేచేలో సుబ్బులు ముక్కుపుడకమీద మెఱసి ఓ సూర్యకిరణం, ఉపధ్రక్రమానిది, తనయొక్క ప్రతి బింబాన్ని బిందెమీద ప్రతిఫలింపజేసి ప్రతిబింబ ప్రతిబింబంగా విరమించింది. అర్కుని ఆఖరుకిరణమో ? అది దేనిమీదను ప్రతిఫలింపలేదు గాని ఒక క్రొత్త ఆకృతి ఒక క్రొత్త వికారం యక్కడున్న గుర్రానికి కలగజేసింది. ఉన్నపాళంగా గుఱ్ఱ మొక్కసారి తన ముందరి రెండుకాళ్ళను పైకెత్తి తీర్థపు రథం మీది గుఱ్ఱంలా వొడుపు వహించి పెద్దగా సకిలించి హరాం గావించింది. ఆ హరాంకు ఝులికిపడి సుబ్బులుయొక్క పొందుగా దుత్తిష్ఠ దయ్యేలో ఎటుచూచినా అంధకారమే.

ఆ అంధకారములో ఆ నాయకుడు ఆ గుర్రంయొక్క జూలును యదిమిపట్టినవాడై "హైరో !" యంటూ రేన్సులు లాగిపట్టి నిలబెట్టినట్లు నిలబెట్టాడు. నాయికి సుబ్బులు ఆలోపుగా ఆ చీకటిలోనే బిందెవిండా యచ్చపు నీరు ముంచుకొన్నదై లంకమట్టిని కాళ్ళతడితో అర్ద్రంగావిస్తూ గుఱ్ఱంకేసి నడవసాగింది.

"నాముండా ముద్దులగుర్రాని కెంత పొగరు : ఒరే ! నథసిమ్మలూ ! జట్కా క్కట్టినప్పుడూ ఇలాగ్గానే పొటమరించి

పోతుందిరా ఇది ?" అని అడిగింది. "నీవెప్పుడూ సూణ్నేలే నేను జట్కా తోలడం ?" "సూడకేం ! చూశాను. కాని నీవు తోల్తూంటే జట్కాలోనే కూఖోడం సంప్రాప్తమవలేదెన్నడూ" "అదెంతసేపు ! రేవు సందెలదేలోపల ఎక్కించి గుర్రాన్ని నురువులు గ్రక్కిస్తూ—" "నురువులే ? నురువులే ? దాని న్నుందే ? వెఱ్ఱిముండ మాటాడదు !" అంటూ సుబ్బులు అబ్బుర పడింది, అబ్బురపాటులో సానుభూతి చూపింది, నరసిమునికా తోచింది కమోసు వెంటనే సానుభూతి జంతువంటే. లేక అనక తప్పకే యన్నాడో ?

"అయితే బిందెనిండా నీళ్ళు, నీళ్ళబిందెతో నీవూ, నీతోనూ నీబిందెతోనూ నేను ఎలా గుర్రమెక్కి కూర్చుని దాటుతాం ఈపాటిరేవు ! నీళ్లోలకపోసెయ్యి !" అన్నాడు. "సెబాసు ! మనమొచ్చిందే నీళ్ళకు ! నీలట్టుకు పోకపోతె ఏంవట్టుకు రావడానికి పోయినావు బిందుచ్చుకు అని యడగర్రా వీధంట సూసినో రందయూను ?" అంది. అని కులుకుతూ ఏస మాటతో వెలువడ్డ సహజవికాసం యంగేయించినట్టు చెంగేసిందై గుఱ్ఱంకేసిచూస్తూ, నరసిములు సాయాన్న గుర్రాన్నెక్కి విందు నీళ్ళబిందె నెత్తిమీద నిలబెట్టుకుంది. తొణకనివ్వదుగా ! ఎన్నాళ్ళనుండి నేర్చిన నేర్పో అది ? వారే !

పాటిరేవు దాటారు. దుబ్బుల్లో పడ్డారు. దారితప్పారో లేకపోతే దారిలోనే వోపెద్దవెలుగు దారితప్పినట్లు తోవజేసిందో? వో పెద్దవెలుగు ! దూరపుకొండలమీదకు దగ్గరసావున్న బాకి రేవు బానలమీదకు ఒకేజ్వాల విసురుతూ ప్రజ్వరిల్లిపోతూంది.

" మనం ఇందాక వచ్చినప్పుడుందిరా ? ఈ మంట నర

" ఈ కాస్తలో దారితప్పడమేమిటి ? ఎవరో దారిలోనే శవాన్ని తగలేసి పోయినార " న్నాడు నరసిములు.

మరెటు చూచినా అడ్డదిడ్డంగా, గుచ్చిన కత్తులమొనలల్లే మోళ్ళువారిన ఆ మొక్కా యీ మొక్కా. రక్కసకావచ్చు. ఎక్కడేసినా ఊడిరాని మణోముళ్ళచిక్కు కావచ్చు. కాబట్టి ఆ రగుల్తూవున్న కాడు దాటుకు వెళ్ళాలవాళ్ళు ! లేకుంటే ఆకాడు చల్లారిపోయిందాకా ఆగాలక్కడ. ఎంతలో ఎంత దుస్సాధ్యమైనటువంటిన్ని దురవబోధమైనటువంటిన్ని పరిస్థితి నెదుర్కోవలసి వచ్చిందో చూవారా ? పాఠకులారా ! వారలు ? దానికి కారణ మేమిటంటారు ? చీకటి పడిపోవడమే. చీకటిలో రెండో త్రోవ కనిపించకపోవడమే. ఊరిదగ్గఱలోవుంది. ఉచ్చున బడ్డ పక్షుల్లా, తెన్ను తెలీక ఒకళ్ళకేసి వొకళ్ళు వాళ్ళిద్దరూ వో నిమేషం చూచుకున్నారు.

" బిందెలో నీళ్ళిప్పుడైనా వొలకపోసెయ్యి ! గుర్రానికి ' గాలా ' పిచ్చి పడితే కాల్తూ కాల్తూవున్న శవాన్ని చల్లార్చిన పాపాన్ని పోతాం మనమ " న్నాడు నరసిములు. సుబ్బులు " వోయి ! వెఱ్ఱి రాయుడా ! నాబిందెలోవున్న నీళ్ళేనాటికీ తొణకవనుకో ! ఈ మంటకాదుకదా మఱి నీయెత్తు మంట లెగసినా తొణకవణుకో ! ఇయ్యి ' గాలా ' పియ్యి అంది.

నరసిములు గుర్రానికి పొట్టింక వోతాపిచ్చాడు. గుఱ్ఱం యంతరిక్షాని కెగసినట్టు నాలుగుకాళ్ళూ పైకెత్తి వొక్క హుడాముణ మంట దాటింది.

సుబ్బులు వెంటనే " తొణికిందా ? వొక్కచుక్కైనా నానెత్తిమీది బిందెనుండి తొణికిందా ? చెప్పు!" అని అడిగింది.

" బిందెనుండి తొణకలేదుగాని నీకంటినుండి తొణికింది కన్నీటి చుక్క! నీక్కనిపించడం లేదేమో రిక్క? ప్రతిఫలిస్తూవుంది కంటి దిగుచాయనే. నేతుడిచేస్తానుండ" న్నాడు నరసిములు. "ఎందుకులే రెప్పలప్పళిస్తే అదే పడిపోతది. కనిపెట్టావూ నీవు? కారుమీద సరిగా గుర్రం లగించినప్పుడేదో ఆకట్టై పరమ రహస్యంగా అడిగినట్టయింది. దాని చెయి పయికి లెగిసింది. ఈనాయెద పట్టైంత బిగించి ఘనీభవింపజేసినా కరక్క మానిందికాదు. అబ్బా ఈకంటి నీరు తొణికింది కామోసు.... రెండు కళ్ళనూనా? ఇస్! శరీరసాధక మెంతచేస్తేనేమి? వెచ్చగా కంటినీరు తొణక్క మానిందికాదు. ఈవెలితి కనిపెట్టి తెరువర్లు విలదీసి ప్రశ్నించరుగదా?" అని యనుకొంది అతి అమాయకంగా. అనుకొంటూ నొకానొక వింతచింతతో సుబ్బులు గుర్రాన్నిదిగి నరసిమ్ములునుండి విడి వడి ఊరి మాటుమణు పులో తన కంటినీరు తుడుచుకొంటూ గిము సేరుకుంది.

ఆమె యెదదవెలితి కనిపెట్టిన వారెవరున్నూ మఱిలేరు. అందరూ ఆమె తెచ్చిపెట్టిన మంచినీళ్ళ నిండుబిందె చూచి రేపకడ సంతుష్టులైనవారలే!

.... .... .... .... ....

# అమృత హారతి

కృష్ణమోహన్ మదరాసు తిరువళిక్కేణి, కార్ స్ట్రీటు యువక రత్నం వైష్ణవమతస్థుడు. పచ్చని దేదీప్యమానమైన శరీరం